

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 25-01-2026 సంపుటి : 07 సంచిక 253 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఏడాది నుంచి ఉద్యమంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర: సీఎం చంద్రబాబు

తిరుపతి, జనవరి 24: స్వచ్ఛాంధ్ర కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని.. అది మన జీవన విధానంగా మారాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం నగరిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవలో పాల్గొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వచ్ఛాంధ్రను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన లెగసీ వేస్ట్‌ను ఏడాదిన్నరలో పూర్తిగా తొలగించామని చంద్రబాబు తెలిపారు. పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త



సేకరణ చేస్తున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. విశాఖపట్నం, గుంటూరులో ఇప్పటికే ప్లాంట్లు పనిచేస్తున్నాయన్నారు. రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులోనూ నూతన ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాలు తయారుచేసిన కంపోస్ట్‌ను రైతులకు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. చెడు ఆలోచనలతో నేరస్తులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశామని, స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని సీఎం అన్నారు. ఐదేళ్లలోనే ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండేలా స్వచ్ఛాంధ్రను తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏడాది నుంచి ఉద్యమంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రను నడిపిస్తున్నామని చెప్పారు. మార్చి నాటికి 1.12 కోట్ల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2018లో ఆంధ్రప్రదేశ్‌ను ఓడీఎఫ్(ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ)గా నిలబెట్టామని, ఇప్పుడు ఓడీఎఫ్ ప్లస్ దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. అంతకముందు.. నగరి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు విస్తృత పర్యటన చేపట్టారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా నగరి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ ప్రచార రథాలను ఆయన ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ పరికరాలను అందజేసి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్మికులను అభినందించారు. తర్వాత స్టాల్స్‌ను సందర్శించిన సీఎం.. ప్రకృతి వ్యవసాయం విషయంలో అధికారులను ప్రశ్నించారు. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరికి 5000 ఎకరాలతో ఎకనమిక్ క్లస్టర్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సోమశిల నుంచి స్వర్ణముఖి ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గానికి కృష్ణమ్మ నది నీటిని తీసుకురావాలని కోరారు.


## విశాఖ ఉక్కుపై కేంద్రం ప్రత్యేక దృష్టి: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



విశాఖపట్నం, జనవరి24 : విశాఖపట్నం ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. కేంద్రం పాలసీకి విరుద్ధంగా రాష్ట్ర ప్రజలు సెంటిమెంట్, రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ఒడుదుడుకులు లేకుండా నడుస్తోందనే నమ్మకం తమకు ఉందని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్లాంట్‌పై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు స్టీల్ ప్లాంట్‌లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించామని ఆయన అన్నారు. సాగర్ మాల కన్వెన్షన్స్‌లో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు సీఐఎస్ఎఫ్ ఐజీ శర్వాణన్, సీఐఎస్ఎఫ్ డీఐజీ డా. రాఘవేంద్ర కుమార్, పోర్టు సెక్రెటరీ రమణమూర్తి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం విభాగాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ ప్రసంగిస్తూ.. రాబోయే మూడు నెలల్లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగబోతున్నాయని ప్రస్తావించారు. పొత్తులపై అధినాయకత్వానిదే తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 4న స్టీల్ కార్యదర్శి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు వస్తున్నారని శ్రీనివాస వర్మ తెలిపారు. తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందనే నమ్మకం తమకుందని ధీమా వ్యక్తం చేశారు శ్రీనివాస వర్మ. మూడు రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వం విజయం సాధిస్తుందని కాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్ తర్వాత రాజకీయాల్లో సినీ గ్లామర్ వర్కౌట్ కావడం లేదన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బలమైన నాయకుడని.. ఏపీలో కలిసి పోటీ చేయడం వలన తమ కూటమి విజయం సాధించిందని తెలిపారు. దేశంలో ప్రధాని మోదీ పాలనపై విశ్వాసం ఉందని.. మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. సినీ గ్లామర్‌కు మించిన స్టార్ ప్రధాని నరేంద్రమోదీ అని అభివర్ణించారు. భారత ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక.. ఉద్యోగాల భర్తీకి మిషన్ మోడ్‌లో ముందుకు వెళ్తున్నారని వెల్లడించారు. ఇప్పటివరకు 17 రోజ్‌గార్ మేళాలు నిర్వహించినట్లు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

## పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు..
### ఎంపీ ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్


న్యూఢిల్లీ: బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ కు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో హాజరయ్యేందుకు తాత్కాలిక బెయిల్ కానీ, కస్టడీ పెరోల్ కానీ ఇవ్వాలని రషీద్ ఇటీవల కోర్టును కోరారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్ఐఏకు గతవారం ప్రత్యేక ఎన్ఐఏ జడ్జి ప్రశాంత్ శర్మ నోటీసులు జారీచేశారు. కోర్టు తాజా ఆదేశాలపై రషీద్ తరఫు న్యాయవాది నిషిత గుప్తా మాట్లాడుతూ, బడ్జెట్ సమావేశాలు జరిగే జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకూ అన్ని రోజులూ హాజరయ్యేందుకు కోర్టు అనుమతించిందని



చెప్పారు. పార్లమెంటు సెక్యూరిటీతో పాటు పోలీసు సెక్యూరిటీతో ఈ సమావేశాలకు రషీద్ హాజరవుతారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రనిధుల కేసుకు సంబంధించి 2019లో రషీద్‌ను అరెస్టు చేశారు. విచారణలో ఉండగానే ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా నియోజకవర్గం నుంచి పోటీ చేసి నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై 2 లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కాగా, రెండు విడతల బడ్జెట్ సమావేశాల్లో భాగంగా తొలివిడత జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకూ జరుగుతుంది. తిరిగి మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తుంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు పార్లమెంటులో బడ్జెట్ సమర్పణ జరుగుతుంది.

## నగరిలో టిడిపి చేసింది శూన్యం: రోజా

తిరుపతి: నగరిలో టిడిపి ఎంఎల్ఎ గాలి భాను ప్రకాశ్ చేసింది శూన్యమని వైసిపి నేత, మాజీ ఎంఎల్ఎ రోజా విమర్శించారు. నగరిలో చంద్రబాబు పర్యటిస్తుండడంతో ఆమె మీడియాతో మాట్లాడారు. కల్యాణమండపం, సబ్ స్టేషన్, పాలిటెక్నిక్ కాలేజీ, పార్కు, షాదీ మహల్ అన్నీ తామే కట్టామన్నారు. పేదవారికి ఇళ్లతో సహా తామే ఇచ్చామని, చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు కాబట్టి టెక్స్‌టైల్ పార్క్ పెడతామని టిడిపి నేతలు చెబుతున్నారని, సిఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలు వినలేక ప్రజలు పారిపోయారని, నగరి నియోజకవర్గానికి ఉపయోగపడేది టిడిపి చెప్పినదాంట్లో ఒక్కటి లేదన్నారు. నగరి టిడిపికి కంచుకోట అని, సూపర్ సిక్స్ ప్రకటిస్తే అసాధ్యం అన్నారని, సూపర్ సిక్స్‌లను సూపర్ హిట్‌గా అమలు చేసి చూపించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పెన్షన్లు, తల్లికి వందనం సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఐదేళ్లలో ఎపిని నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.



## 61 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జనవరి 24: దేశవ్యాప్తంగా జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

## ఏపీలో పేదల ఇళ్లపై కీలక అప్డేట్..! డెడ్ లైన్ ఖరారు..!

ఏపీలో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం ఇవాళ మరో గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ప్రస్తుతం పేదల కోసం చేపడుతున్న ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఇవాళ గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి కొలుసు పార్థసారధి ఈ మేరకు టార్గెట్ పెట్టేశారు. దీంతో పేదలకు ఈసారి కచ్చితంగా ఇళ్ల పంపిణీ ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి పార్థసారథి అధికారులను ఆదేశించారు. రానున్న ఉగాది నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వాటి ప్రారంభోత్సవానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు టార్గెట్ ఇచ్చారు. విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అమలు తీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ పేదవాడికీ పక్కా ఇల్లు నిర్మించాలని, ఆ లేఔట్ లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నాణ్యతతో కూడిన ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.




# సంపాదకీయం

ఆదివారం 25-01-2026

## ఇండియా ఆపరేషన్ సముద్ర

చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది.అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు.డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు.అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలుపెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటివరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్మెర్సిబుల్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రంలో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద, మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సముద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏతరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూనే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమని పలువురు పేర్కొంటున్నారు.ఫలితంగా భారత ఆర్థిక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందిన దేశంలా కాకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశాలకు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

## కంటోన్మెంట్ ఏరియాలో మంచినీటి సరఫర మెరుగుపరచాలి

### బోర్డ్ సభ్యురాలు భానుక నర్మద

సికింద్రాబాద్,శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రిగేడియర్ రాజీవ్, ప్రెసిడెంట్, కంటోన్మెంట్ సీఈవో అర్వింద్ కుమార్ దీవ్వేది, జాయింట్ సీఈవో ఆశిక్ హుస్సేన్, నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ హాజరయినారు. బోర్డు సమావేశంలో ప్రజలకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై నర్మద మల్లఖార్జున్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కంటోన్మెంట్ భూముల పరిహారం కింద ఇప్పటికే రూ.303 కోట్ల రూపాయలు జమ కాగా, ఇంకా రూ.13 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. మిగిలిన ఈ రూ.13 కోట్ల నిధులతో కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డుల్లో పూర్తిగా పాడైపోయిన, దెబ్బతిన్న రోడ్లను వెంటనే నిర్మించాలని ఆమె కోరారు.ఇటీవల ఆస్తి పన్నుల మదింపు సమయంలో పన్నులు 100 నుండి 200 శాతం వరకు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పన్నులను 15 నుండి 20 శాతం వరకు మాత్రమే పెంచి ప్రజలపై భారం పడకుండా చూడాలని బోర్డును కోరారు.ఇటీవల జూబ్లీ బస్ స్టాండ్ ఆవరణలోని అటల్ బిహారీ వాజపేయి పార్క్ ప్రక్కన ఖాళీ స్థలంలో కొందరు బీద ప్రజలు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, ఆ స్థలం రక్షణ శాఖ అధీనంలోని కంటోన్మెంట్ బోర్డు స్థలం కావడంతో నిర్మాణాలను తొలగించడం జరిగింది. దీని వలన అనేక మంది బీద ప్రజలు రోడ్డున పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఈటెల రాజేందర్ స్పందించి నేషనల్ ఎస్టీ కమిషన్లో ఫిర్యాదు చేసి, కూల్చివేసిన స్థలంలోనే కంటోన్మెంట్ బోర్డు ద్వారా మళ్లీ నిర్మాణాలు చేపట్టి వారికి కేటాయించే విధంగా కృషి చేసినందుకు అక్కడ ఎంపి ఈటెల రాజేందర్కు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానుక నర్మద మల్లిఖార్జున్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా 3 నుండి 4 రోజులకు ఒకసారి మాత్రమే అందుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలం ప్రారంభమయ్యేలోపే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచాలని కోరారు.అదేవిధంగా హెచ్ఎండీయే ం ఆధ్వర్యంలో కంటోన్మెంట్లోని రామన్నకుంట (లేక్) సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఒక నెలలోపు ఎన్వోసీ ఇవ్వాలని రక్షణ శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు.అంతేకాకుండా, బానుక నర్మద మల్లిఖార్జున్ గారు శుభవార్త తెలియజేస్తూ రానున్న పక్షం రోజుల్లో రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కంటోన్మెంట్కు గ్రాంట్ (నిధులు) మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.

## మణుగూరులో సీఎం పీఎఫ్ చుట్టూ ముసురుకున్న మబ్బులు..

.అధికార హోదా ఉన్న చర్యలేని సెక్యూరిటీ ఆఫీసర్...?

విచారణ మొదలైతే కదిలే అక్రమాల గుట్టలు...!


ఎవరి అండతో ఇంత ధైర్యం...? ఎవరి ఆశీస్సులతో ఈ దందా...?

మణుగూరు లో భద్రత కాదు భయభ్రాంతుల పాలన...!

భద్రాద్రి కొత్తగూడెం ,మణుగూరు ఏరియాలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల జీవితాల్లో సీఎం పీఎఫ్ ఓ భరోసాగా ఉండాలి. కానీ అదే పీఎఫ్ ఇప్పుడు వారికి ఆందోళనగా మారింది.మురళి ఏజెన్సీకి చెందిన పలువురు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు నెలల తరబడి పనిచేస్తున్నా, తమ సీఎం పీఎఫ్ ఖాతాల గురించి సరైన సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “డబ్బులు కట్ అవుతున్నాయి? కానీ పీఎఫ్ ఎక్కడ ఉంది?” అన్న ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి.ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన చోటే మరో కథ మొదలవుతోంది. సీఎం పీఎఫ్ దరఖాస్తులపై అసలు సంతకాలు లేకుండానే, ఒక ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్ దొంగ సంతకాలు సృష్టించి గార్డుల నుంచి రుసుములు వసూలు చేశాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బయటకు రాకుండా ఉండేందుకు పత్రాల మీదే ఆటలాడినట్టు కార్మికులు చెబుతున్నారు.ఇదంతా తెలిసినా తెలియనట్టుగా వ్యవహరిస్తున్న ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులపై సిఫారసులు, సంతకాలు ఎలా వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఈ కుంభకోణం జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నేరెత్తినట్టు ఉండటంతో కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోంది.“ఇది ఒక్కరి తప్పు కాదు? వ్యవస్థలోనే లోపం ఉంది” అంటున్నారు కార్మిక సంఘ నేతలు. సరైన విచారణ జరిపితే ప్రైవేట్ సెక్యూరిటీ విభాగంలో మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.ఇప్పుడు మణుగూరులో వినిపిస్తున్న ఒక్కటే డిమాండ్?సీఎం పీఎఫ్ గందరగోళంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.లేకపోతే భద్రత కాపాడే చేతులే తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సిన పరిస్థితి తప్పదని కార్మికులు చెబుతున్నారు.

## దౌర్జన్యాలపై గొంతెత్తడం నా హక్కు.. పోలీసుల వార్నింగ్‌లకు భయపడను : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులను గంటల తరబడి దర్యాప్తు పేరిట వేధించడాన్ని తప్పుబడితే తనకు సిట్ నోటీసులు అందించడంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు.తెలంగాణ భవన్ లో పత్రికా సమావేశంలో ఖండించిన 12 గంటల లోపే రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చి సిట్ పోలీసులు నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో ఆధారాలతో సహా రిప్లై ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధం కావాలని వార్నింగ్ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, దౌర్జన్యాలపై గొంతెత్తడం నా హక్కు అని వెల్లడించారు.పోలీసుల వార్నింగ్‌లకు బయపడేది లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కూడా వ్యక్తిగత దూషణలు , చిల్లర భాషను వాడనని, అదేవిధంగా వాస్తవాలు దాచనని తెలిపారు. దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం కూడా ఆపనని వెల్లడించారు.రేవంత్ రెడ్డి ట్యాపింగ్ జరగడం మామూలే అని ఢిల్లీలో చెప్పినట్లుగా కూడా వార్తలున్నాయి. అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు? అని ప్రశ్నించారు.సిట్ ఛీఫ్ సజ్జనార్‌పై ఆంధ్ర ప్రదేశ్ లో నమోదైన కేసుల మీద మరో సిట్ వేయాలి అని డిమాండ్ చేసినట్లుగా నోటీసులో ఉందని , ఇది వాస్తవ విరుద్ధమని అన్నారు. ఓటుకు నోటు కేసులో లైవ్ కెమెరాలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిన తరువాత, ఆంధ్ర ప్రదేశ్ నాయకుల ఫోన్లు తెలంగాణ ప్రభుత్వం, ఇంటలిజెన్స్ అధికారులు ట్యాప్ చేశారని 2015 జూన్ నెలలో ఆంధ్రలో అనేక పోలీసు స్టేషన్లలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కేసులు నమోదయ్యాయని పత్రికల్లో చాలా వార్తలొచ్చాయి. ఆ సమయంలో ఆంధ్రలో కూడా ఒక సిట్ కూడా ఏర్పాటు అయ్యింది.నాడు తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం లో అధికారిగా సీపీ సజ్జనార్ పనిచేశారు అన్న అవగాహన తనకుందని అన్నారు. ప్రస్తుత ట్యాపింగ్ వ్యవహారం పై వేసిన రెండో తెలంగాణ సిట్‌కు ఛీఫ్ గా ఉండడం నైతికంగా కరెక్టు కాదని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మరుగున పడిన విషయాలను ప్రజల ముందుకు తీసుకరావాల్సిన కనీస బాధ్యత తనపై ఉందన్నారు. ఈ విషయం మీకు నచ్చకపోతే వివరణ ఇవ్వాలని సూచించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పలు కుంభకోణాల (బొగ్గు కుంభకోణం తో సహా) మీద సిట్ వేయాలని డిమాండ్ చేశానని వివరించారు. తాను సజ్జనార్‌తో సహా ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడి వ్యక్తిత్వ హననానికి పాల్పడలేదని



వెల్లడించారు. గత రెండేళ్లుగా కేటీఆర్, హరీష్ రావు, మరెందరో బీఆర్ఎస్ నాయకులపై రేవంత్ రెడ్డి ప్రతీకార పాలనలో తీవ్రమైన వ్యక్తిత్వ హననానికి గురయ్యారని పేర్కొన్నారు. ఆ విషయంలో నిందితులపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.ప్రభుత్వం చేస్తున్న ట్యాపింగ్ పై చేసిన ఫిర్యాదు చేస్తే పోలీసులు ఇంతవరకు రేవంత్ రెడ్డికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. కనీసం తనకు అక్నాలెడ్జ్మెంటు కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. కేవలం బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే నోటీసుల మీద నోటీసులు రావడం, మీడియా లీకులు, జర్నలిస్టుల, సోషల్ మీడియా ఆక్టివిస్టుల విచ్చలవిడి అరెస్టులు దేనికి సంకేతమని నిలదీశారు. నాలుగు గోడల మధ్య జరగాల్సిన దర్యాప్తుపై గాంధీభవన్ లో కాంగ్రెస్ నాయకులు ప్రతిరోజూ లైవ్ కామెంటరీ ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

## దాల్ గేట్ గెస్ట్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం.. రంగంలోకి డాగ్‌స్క్వాడ్



శ్రీనగర్‌లోని దాల్‌గేట్ తీరాన ఉన్న గెస్ట్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారమందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువస్తున్నారు. ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ కమాండ్ వివరాల ప్రకారం.. ప్రాథమిక అంచనా ప్రకారం దాల్ ఫాగ్ అనే మూడు అంతస్థుల గెస్ట్ హౌస్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. భారీగా నష్టం సంభవించింది. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్కువ సమయంలో మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలగా.. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విశ్లేషించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్టు పేర్కొంది. ఘటనా స్థలంలో ఏవైనా డెడ్‌బాడీలు కానీ.. ఇతర మండే పదార్థాలు కానీ ఉన్నాయా..? అని తెలుసుకునే స్పెషల్ డాగ్ స్క్వాడ్ టీం పరిశీలిస్తుందని.. ఇప్పటివరకు ఒకరికి గాయాలయినట్టు నిర్ధారణ అయిందని.. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని పేర్కొంది.


## ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగుస్తుందా.. అబుదాబిలో కొనసాగుతున్న శాంతి చర్చలు



న్యూఢిల్లీ: దాదాపు నాలుగేళ్ల క్రితం మొదలైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధానికి ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా వివిధ దేశాధినేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మరోసారి ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయి. అబుదాబిలో రెండు దేశాల ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. అమెరికా ఒత్తిడి మేరకు ఉక్రెయిన్ ఈ శాంతి చర్చలకు అంగీకరించింది.రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ఎలాగైనా ముగింపు పలికేలా చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్నారు. అందుకే అమెరికా ఈ చర్యలకు దిగింది. 2022 ఫిబ్రవరిలో ఈ యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. ఇరు దేశాలు ఇప్పటికీ.. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూనే ఉన్నారు. అయితే, రష్యాదే పైచేయిగా ఉంది. ఉక్రెయిన్ కు చెందిన విద్యుత్ సంస్థలు సహా కీలక ప్రదేశాలపై రష్యా దాడి చేసింది. దీంతో ఉక్రెయిన్ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. అయినప్పటికీ రష్యాపై పోరాడుతూనే ఉంది. ఇక.. తాజా శాంతి చర్చలకు సంబంధించి అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తోంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మాట్లాడారు. యుద్ధానికి ముగింపు పలకడం రష్యా చేతిలోనే ఉందన్నాడు. ఎందుకంటే యుద్ధం మొదలుపెట్టింది రష్యానే అని గుర్తు చేవారు. తమ దేశం తరఫున చర్చలు జరుపుతున్న టీంను తాను నిరంతరం సంప్రదిస్తున్నానని, అయితే, ఈ విషయంపై ఏమీ చెప్పలేనని ఆయన అన్నాడు. రేపటికల్లా దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నాడు. ఇటీవల దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ట్రంప్.. జెలెన్ స్కీని కలిశాడు. అక్కడే ఆయన శాంతి చర్చల గురించి ట్రంప్ అతడికి సూచించాడు.శాంతి చర్చలు సందర్భంగా తమ దేశ భద్రతకు యూరప్ హామీ ఇవ్వాలని జెలెన్ స్కీ కోరుతున్నాడు. శాంతి ఒప్పందం విషయంలో రష్యా మాత్రం కాస్త ఆలోచించి అడుగులేస్తోంది. ఉక్రెయిన్ లోని కీలక ప్రాంతమైన డోనెస్క్ ప్రాంతాన్ననని తన ఆధీనంలో ఉంచుకోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ కోరుతున్నాడు. కానీ, దీనికి జెలెన్ స్కీ అంగీకరించడం లేదు. ఈ ప్రదేశం దాదాపు 5,000 చదరపు కిలోమీటర్లు ఉంటుంది.

## ఇల్లెందులో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు

ఇల్లెందు, జనవరి 24 : రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ ఇల్లెందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఇల్లెందు జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఇల్లెందు ఏఎంసీ మాజీ చైర్మన్ బానోత్ హరి సింగ్ నాయక్, డిసిసిబి మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్రావు, సీనియర్ నాయకుడు ముఖ్య దళ్ సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, అబ్దుల్ నబీ, శీలం రమేష్, జెకె శ్రీను, కటకంచి వీరస్వామి, రవితేజ,



ఫూజి, అజ్మీర బావు సింగ్ సునీల్, లలితకుమార్ పాసి, మదర్ బీ, మూలగుండ్ల ఉపేందర్, మునిగంటి శివ, బర్మావత్ లాల్చంద్, జి శ్రీను, బజార్ సత్యనారాయణ, రామ్ లాల్ పాసి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# సంక్లిష్ట పరిస్థితి లో వైకాపా

విజయవాడ, జనవరి 24, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కోక తప్పదు. మరో వారం రోజుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. అనేక బిల్లులు ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. అయితే బిల్లుల విషయంలో బిజెపి పట్ల ఎప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుకూలంగానే ఉంటుంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించే అమరావతి అంశంపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలా ముందుకెళ్తుంది అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. లోక్సభ తో పాటు రాజ్యసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది సభ్యుల బలం ఉంది. ఆ పార్టీ స్టాండ్ చెప్పాల్సి ఉంటుంది.అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిధుల సమీకరణ జరిగింది. కేంద్ర ప్రభుత్వం సైతం 15 వేల కోట్ల రూపాయల సాయం ప్రకటించింది. ప్రపంచ బ్యాంకుతోపాటు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు నుంచి నిధులు సర్దుబాటు చేసింది. అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని రైతులు కోరుతూ వచ్చారు. ఏపీ ప్రభుత్వం సైతం ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి చేస్తోంది. అయితే రాజధానిల విషయంలో నోటిఫై చేయాల్సిన అవసరం లేదని కేంద్రం చెబుతున్నా.. ఏపీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా.. పరిగణలోకి తీసుకోవాలని కూటమి ప్రభుత్వం కోరింది. అందుకే ఇప్పుడు అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లును పార్లమెంటులో పెడతారని తెలుస్తోంది. అయితే దీనిపై వైసీపీ స్టాండ్ ఏంటనేది



తేటతెల్లం కానుంది.అమరావతి పై ఆది నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డి వ్యతిరేక భావనతోనే ఉన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అని వ్యాఖ్యానించేవారు. అసలు రాజ్యాంగం లో రాజధాని అనే పదమే లేదని తేల్చేశారు. ఐదేళ్లపాటు అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. మూడు రాజధానులు అంటూ హడావిడి చేశారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి పునర్నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పుడు కూడా అదే వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. నది చెంతనే కట్టారని.. ముంపు ప్రాంతంలో అమరావతి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసేవారు. అయితే ఇప్పుడు పార్లమెంటులోనే నేరుగా వైసీపీ అభిప్రాయం చెప్పాల్సి ఉంటుంది అమరావతిపై. ఇప్పటికే వైసీపీకి వ్యతిరేకంగా అస్త్ర శస్త్రాలను సిద్ధం చేస్తోంది టిడిపి కూటమి. తప్పకుండా ఈ విషయంలో ఏదో ఒకటి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంది. మరి ఎలా స్పందిస్తుందో చూడాలి.

# వరికపూడిశెలకు పర్యావరణ అనుమతులు

ఒంగోలు, జనవరి 24, ఆంధ్రప్రదేశ్లో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. పల్నాడు జిల్లాలో 84,500 ఎకరాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు రూ.3,227.15 కోట్లు ఖర్చవుతుంది. మరోవైపు, కడప, ప్రకాశం జిల్లాల్లో 800 మెగావాట్ల రాజుపాలెం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కూడా అనుమతులు లభించాయి. అన్నమయ్య జిల్లా వీరబల్లి ప్రాజెక్టు అనుమతులు మాత్రం ప్రస్తుతం నిలిపివేశారు.ఆంధ్రప్రదేశ్లో కీలకమైన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి లైన్ క్లియర్ అయ్యింది. పల్నాడు జిల్లాలో ప్లాన్ చేసిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరు అయ్యాయి. ఈనెల 9న జరిగిన సమావేశంలో కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ చర్చించింది. ఈ మేరకు ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన కమిటీ.. అల్ప వర్షపాతం, వెనుకబాటుతనం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రతిపాదనలపై చర్చించిన తర్వాత అనుమతులకు సిఫార్సు చేసింది. గత పదేళ్లుగా ఈ ప్రాజెక్టుకు అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు.. చివరికి అనుకున్నది సాధించారు.ఈ ప్రాజెక్టు ద్వారా 84,500 ఎకరాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.3,227.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు వల్ల 25 గ్రామాలకు సాగునీరు, 20 వేల మందికి తాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్ట్ కోసం 270 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించారు.. అడిగొప్పుల, ఆత్మకూరు, దరివేముల ప్రాంతాల్లో సేకరించనున్నారు. ఈ భూమిలి 19.13 హెక్టార్లు అటవీ భూమి ఉంది. 4.86 టీఎంసీల నీటిని వెల్దుర్తి, దుర్గి, మాచర్ల, కారంపూడి మండలాల్లోని పొలాలకు సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకువరికపూడిశెల వాగు నుంచి ఎత్తిపోయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మేరకు.. మొదట 24,900 ఎకరాలకు పరిమితమైన ఈ ప్రాజెక్టు పరిధిని 84,500 ఎకరాలకు పెంచారు. దీని కోసం గతేడాది అక్టోబర్ 31న జీవో కూడా విడుదలైంది. ఈ ప్రాజెక్టు వల్ల పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుంది.మరోవైపు మరో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకుకు కూడా అనుమతులకు లైన్ క్లియర్ చేశారు. కడప, ప్రకాశం జిల్లాల్లో ఏపీ జెన్కో, ఎన్హెచ్పీసీ, గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కలిసి 334.8 హెక్టార్లలో తలపెట్టిన 800 మెగావాట్ల రాజుపాలెం క్లోజ్లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును ప్లాన్ చేశాయి. ఈ ప్రాజెక్టుకు కూడా పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్ అయ్యింది. మరోవైపు అన్నమయ్య జిల్లాలో 489.1 హెక్టార్లలో నిర్మించాలని ప్లాన్ చేసిన వీరబల్లి ప్రాజెక్టుకు (పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్) సంబంధించిన అనుమతులను ప్రస్తుతం నిలిపివేశారు.

# అన్నమయ్య జిల్లాలో కొండచిలువల కలకలం

అన్నమయ్య , పుంగనూరు మండలం మర్రిమాకులపల్లి గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో రెండు భారీ కొండచిలువలు కలకలం రేపాయి. సుమారు 13 అడుగుల పొడవు ఉన్న ఈ కొండచిలువలను పశువులను మేపేందుకు వెళ్లిన గ్రామస్థులు గుర్తించారు.


వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ శోభనాద్రి నేతృత్వంలోని రెస్క్యూ బృందం అక్కడికి చేరుకుని మూడు గంటల పాటు శ్రమించి చాకచక్యంగా రెండు కొండచిలువలను పట్టుకుంది. అనంతరం వాటిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

# ప్రశ్న మీది ? గొంతు నాది

ఏలూరు, జనవరి 24, టీడీపీకి చెందిన ఓ యువ ఎంపీ ప్రజల సమస్యలను నేరుగా పార్లమెంట్ వేదిక వరకు తీసుకెళ్లాలనే కొత్త ఆలోచనతో ముందుకు వచ్చారు. సాధారణంగా ప్రజా ప్రతినిధులు సమావేశాలు, వినతులు, దరఖాస్తుల ద్వారానే సమస్యలు తెలుసుకుంటారు. కానీ ఈ ఎంపీ మాత్రం ప్రజలే స్వయంగా తమ సమస్యలను చెప్పేలా ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల మాటే ప్రశ్నగా, తన గొంతే వేదికగా మారాలన్న ఉద్దేశంతో 'ప్రశ్న మీది ? గొంతు నాది' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ యాదవ్ . తొలిసారి ఎంపీగా ఎన్నికైనప్పటికీ, తక్కువ సమయంలోనే నియోజకవర్గ ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ, అందరినీ కలుపుకుని వెళ్లే నాయకుడిగా, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రతినిధిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను తరచూ ప్రస్తావిస్తూ వస్తున్నారు.ఇప్పటి వరకు ఉన్న విధానాలకు భిన్నంగా, మరింత ప్రభావవంతంగా సమస్యల పరిష్కారం జరగాలన్న ఆలోచనతో ఈ కొత్త ప్రయత్నానికి ఆయన నాంది పలికారు. 'ప్రశ్న మీది ? గొంతు నాది' కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన సమస్యలను నేరుగా వాట్సాప్ ద్వారా పంపే అవకాశం కల్పించారు. ఇక్కడ ముఖ్యంగా వ్యక్తిగత సమస్యలు కాకుండా, గ్రామం, కాలనీ, పట్టణం లేదా నియోజకవర్గ స్థాయిలో ఉన్న ప్రజా సమస్యలను మాత్రమే పంపాలని సూచించారు. సమస్యతో పాటు దానికి తాము భావించే పరిష్కార సూచనలను కూడా ప్రజలు తెలియజేయవచ్చు.ఏలూరు పార్లమెంట్ పరిధిలో చాలా కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలు కూడా ఈ కార్యక్రమం ద్వారా ఎంపీ దృష్టికి తీసుకురావచ్చు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, ఉపాధి వంటి అనేక అంశాలపై ప్రజల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా, వాటిని పార్లమెంట్లో ప్రశ్నల రూపంలో లేవనెత్తి, కేంద్ర ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలా ప్రజలే ముందుకు వచ్చి సమస్యలను తెలియజేస్తే, వాటికి పరిష్కార మార్గాలు వెతకడం మరింత సులభమవుతుందని ఆయన భావిస్తున్నారు.రాష్ట్రంలోనే తొలిసారి ఈ తరహా ప్రజా భాగస్వామ్య కార్యక్రమం ప్రారంభం కావడం విశేషంగా మారింది. ఈ ప్రయత్నం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పుట్టా మహేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను భయపడకుండా, స్పష్టంగా పంపాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజలు 96181 94377, 98855 19299 అనే వాట్సాప్ నంబర్లకు తమ సమస్యలను పంపవచ్చని ఆయన తెలిపారు. ప్రజల ప్రశ్నలకు తన గొంతు జోడించి, పార్లమెంట్ వేదికగా పరిష్కారం సాధించడమే తన లక్ష్యమని ఎంపీ స్పష్టం చేశారు.

# వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన డిమాండ్ ఇదేనా?

విజయవాడ, జనవరి 24,ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. అయితే ఇప్పటి నుంచే ఆసక్తికరమైన రాజకీయచర్చలు మొదలవుతున్నాయి. కూటమి వచ్చే ఎన్నికల్లో కొనసాగుతుందా? అటే 90 శాతం కొనసాగుతుందని అందరూ చెబుతున్న మాట. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం బీజేపీ, జనసేనఒక్కటిగా మారి టీడీపీకి సీట్ల పొత్తుల విషయంలో కొంత ఒత్తిడి తెచ్చే అవకాశముందని అంటున్నారు. పవన్ కల్యాణ్, బీజేపీ ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాల పై సైలెంట్ వ్యవహరిస్తుండటాన్ని ఇందుకు ఉదహరిస్తున్నారు. ఈసారి నియోజకవర్గాల సంఖ్య పెరగడం ఖాయంగా కనిపిస్తుంది. అదే సమయంలో తమ వాటా సంఖ్య కూడా పెంచాలని బీజేపీ, జనసేన కోరే అవకాశాలు మెండుగా ఉన్నాయి.జగన్ చేసే విమర్శలకు బీజేపీ నేతల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు.అలాగే జనసేన నేతలు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. జగన్ ప్రభుత్వంపై చేసే విమర్శలకు టీడీపీ నేతలే సమాధానమివ్వాల్సి వస్తుంది. మిత్ర పక్షాలు జగన్ చేసే విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం




లేదు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా ఉన్న ఆ రెండు పార్టీలు తమ శాఖకు సంబంధించిన వాటిపై వచ్చిన విమర్శలకు మాత్రమే సమాధానమిస్తున్నారు తప్పించి అంతకు మించి టచ్ మి నాట్ గా వ్యవహరించడం కూడా ఈ చర్చకు దారి తీస్తుంది. 2024 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగానే, ఆయన అంకెలకు రెండు పార్టీల నేతలు ఓకే చెప్పారు.అందుకే 2024 ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సీట్ల పంపకంలో పెద్దగా విభేదాలు తలెత్తలేదు. కానీ 2029 ఎన్నికలకు మాత్రం పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశాలున్నాయి. సహజంగా బీజేపీ,జనసేనల్లోనూ ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అలాగే అధికారంలో ఉన్నటీడీపీ నేతలకు, నియోజకవర్గాల్లో జనసేన, బీజేపీ నేతలకు మధ్య సరైన అవగాహన లేకపోగా అనేక అంశాల్లో విభేదాలు బయటపడుతున్నాయి. దాదాపు 175 నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. తాము కూటమిలో ఉన్నామని మర్చిపోయి తమకు టీడీపీ నేతలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన, బీజేపీ నియోజకవర్గ స్థాయి నేతలు బాహాటంగానే చెబుతున్నారు. అందుకే ఆరెండు పార్టీలు నేతలకు న్యాయం చేయాలంటే కొన్ని సీట్లు ఎక్కువగానే తీసుకోవాల్సి ఉంటుంది. మరి చంద్రబాబు ఆ రెండు పార్టీలను ఎలా ఒప్పిస్తారన్నది చూడాలి.

# దావోస్ కు దూరంగా జనసేనాని

కాకినాడ, జనవరి 24, దావోస్ కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోకపోవడాన్ని జనసేన క్యాడర్ తప్పుపడుతుంది. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దావోస్ పర్యటనలో రాజకీయాల్లో లేని మెగాస్టార్ చిరంజీవిని వెంట తీసుకెళ్లి ఆ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ ను పెంచాలని ప్రయత్నిస్తుంటే, ఇక్కడ మాత్రం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ను దావోస్ కు వెంట తీసుకోకపోవడాన్ని ఖచ్చితంగా ఆయనను నిర్లక్ష్యం చేయడమేనని అంటున్నారు. పవన్ కల్యాణ్ కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులున్నారు. ఆయనను వెంట తీసుకెళితే ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందే తప్ప నష్టం ఏముంటుందని నెట్టింట కొందరు నేరుగా టీడీపీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ను దావోస్ పర్యటనకు దూరం పెట్టడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమేనన్న అభిప్రాయం జనసేన క్యాడర్ లో వ్యక్తమవుతుంది. పవన్ కల్యాణ్ వల్ల కాస్తో కూస్తో లాభం చేకూరుతుందే తప్ప నష్టమయితే జరగదు. లోకేశ్, టీజీ భరత్ వంటి వారిని వెంట తీసుకెళ్లడంలో తప్పులేదు. కానీ అదే సమయంలో పవన్ కల్యాణ్ ను తీసుకెళ్లకపోవడం మాత్రం ఖచ్చితంగా నాయకత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయమేనన్న అభిప్రాయం జనసేనలో వ్యక్తమవుతుంది. తెలంగాణలో మెగాస్టార్ చిరంజీవిని తన వెంట తీసుకెళ్లి ఆయనకు దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగస్వామ్యం కల్పించడంతో కొంత తెలంగాణ ఇమేజ్ పెరిగిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.కానీ తెలుగుదేశ పార్టీ నేతల వాదన మరొకలా ఉంది. పవన్ కల్యాణ్ వస్తానంటే ఎందుకు తీసుకెళ్లరని, ఆయన అనాసక్తి చూపడం వల్లనే చంద్రబాబు నాయుడు ఒత్తిడి చేయలేదని అన్నారు. పవన్ కల్యాణ్ కేవలం దావోస్ పర్యటన మాత్రమే కాదు .. గత ఏడాది నవంబరు నెలలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సుకు కూడా పవన్ కల్యాణ్ దూరంగా ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వారిద్దరి మధ్య సఖ్యత బాగానే ఉందని, కానీ పార్టీ నేతలు, కార్యకర్తలు లేనిపోని అపోహలకు తావివ్వవద్దని, ఏదైనా అనుమానలుంటే నేరుగా పవన్ కల్యాణ్ తో మాట్లాడి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలుగుదేశం పార్టీ నేతలు ఆఫ్ ది రికార్డులుగా చెబుతున్నారు. మొత్తం మీద దావోస్ పర్యటనకు పవన్ దూరంగా ఉండటంపై మాత్రం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మరో వైపు గత ఏడాది దావోస్ లోజరిగిన పెట్టుబడుల సదస్సుకు సీఎం చంద్రబాబుతో పాటు నారా లోకేష్ వెళ్లారు. ఆ సమయంలో కూడా పవన్ కళ్యాణ్ వెళ్లకపోవడం పై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా జనసేన కేడర్ నుంచి అసంతృప్తి బయటపడింది. ఇప్పుడు కూడా సోషల్ మీడియా వేదికగా అటువంటి అసంతృప్తి కనిపిస్తోంది. తెలంగాణలో మెగాస్టార్ చిరంజీవిని తమ వెంట తీసుకెళ్లి దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగస్వామ్యం కల్పించింది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ ఇమేజ్ పెరిగింది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కానీ ఏపీలో డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ కళ్యాణ్ ను ప్రపంచ ఆర్థిక సదస్సుకు తీసుకెళ్లకపోవడం పై విమర్శలు వస్తున్నాయి.అయితే పవన్ విషయంలో చంద్రబాబు ఎప్పుడు జాగ్రత్తగానే ఉంటారు. డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ ను సంప్రదించి అన్నీ చేస్తుంటారని తెలుస్తోంది. ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన ఏ శాఖ కూడా పవన్ కళ్యాణ్ పరిధిలో లేదు. ఆయన అంత గ్రామీణ నేపథ్యం, అటవీ శాఖ వంటి వాటిని చూస్తున్నారు. ఆది నుంచి విదేశీ పర్యటనల విషయంలో పవన్ జోక్యం చేసుకోవడం లేదు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో కూడా పవన్ పాత్ర అంతంత మాత్రమే. గత ఏడాది తెలంగాణ సీఎం వెంట ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెళ్లారు. అప్పట్లో కూడా ఏపీ డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్ కళ్యాణ్ ను ఎందుకు తీసుకువెళ్లలేదు అనేది ప్రశ్న వచ్చింది. కానీ అప్పట్లోనే పవన్ కళ్యాణ్ పరోక్ష సంకేతాలు ఇచ్చారు. ఎటువంటి అసంతృప్తి వ్యక్తం చేయలేదు. ఇప్పుడు కూడా పవన్ కళ్యాణ్ ను సంప్రదించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఒంగోలు టూ హైదరాబాద్ పరుగులే

ఒంగోలు, జనవరి 24, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది. ప్రకాశం జిల్లా అద్దంకిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు, ప్రమాదాలను నివారించేందుకు మినీ బైపాస్ రోడ్డు పనులు వేగవంతమయ్యాయి. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మినీ బైపాస్ పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. పలు నగరాలు, పట్టణాలకు బైపాస్లు, మినీ బైపాస్లు, ఔటర్ రింగ్ రోడ్లు కూడా మంజూరు చేస్తోంది. ప్రకాశం జిల్లా అద్దంకిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు, ప్రమాదాలను నివారించేందుకు మినీ బైపాస్ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గం నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు అద్దంకి మీదుగా వెళ్లే నామ్ రోడ్డులో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ఈ ప్రతిపాదన వచ్చింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు.మొదటి దశలో భాగంగా.. రేణింగవరం రోడ్డులో కాకానిపాలెం నుంచి సూర్య రెస్టారెంట్ వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డుగా మార్చనున్నారు. ఈ పనులకు సుమారు రూ.15 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ రోడ్డు మధ్యలో ఎస్ఎస్పీ కాలువ, రెండు వైపులా సీసీ రోడ్లు, విద్యుత్ లైన్లు, సైడ్ డ్రైయిన్లు ఏర్పాటు చేస్తారు. ఈ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే, పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరడమే కాకుండా, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాలు చేయొచ్చు.అద్దంకి మినీ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా.. అద్దంకిలో కాలువ కట్టపై నెల రోజుల క్రితం ఆక్రమణలను తొలగించారు. బాధితులకు కొండ దగ్గర ఇళ్ల స్థలాలు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించారు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించడంతో వారు కొత్త ఇళ్లలోకి మారారు. ఇప్పుడు ఆ కాలువ కట్టపై గ్రావెల్ రోడ్డు వేస్తున్నారు. రోడ్డును చదును చేసి, రోలర్తో గట్టిపరుస్తున్నారు. కాలువకు రెండు వైపులా రాళ్లు కూడా పెడుతున్నారు. ఇంకో పదిహేను రోజుల్లో ఈ గ్రావెల్ రోడ్డు సిద్ధమవుతుందిఆ తర్వాత 70 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్లు కట్టాలని ప్లాన్ చేస్తున్నారు. మిగిలిన స్థలాన్ని మున్సిపాలిటీ తీసుకుని, ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతానికి గ్రావెల్ రోడ్డుపైనే వాహనాలు వెళ్తాయి. కొన్నాళ్ల తర్వాత సీసీ రోడ్లు వేస్తారు. రెండవ దశలో కాకానిపాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ దగ్గర నామ్ రోడ్డులో కలిసేలా తారు రోడ్డు వేస్తారు. ఈ రెండు పనులు పూర్తయితే మినీ బైపాస్ రోడ్డు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తారు. అద్దంకి మీదుగానే హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా వెళతాయి.. ఈ క్రమంలో ఈ బైపాస్ రోడ్డు నిర్మాణంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ఈ మేరకు అద్దంకి మినీ బైపాస్ నిర్మాణ పనుల్ని మరింత వేగవంతం చేశారు.

# విజయనగరంలో కొత్త పోలీస్ స్టేషన్లు

విజయనగరం, జనవరి 24, విజయనగరం జిల్లాలో రెండు పోలీసు స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. జిల్లాలో జనాభా పెరుగుదల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నేపథ్యంలో ఈ 2 కొత్త పోలీస్ స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. నెలఖరులోగా కార్యకలాపాలు మొదలయ్యేలా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనకు ఆమోదం లభించగా, భోగాపురంలో విమానాశ్రయం కోసం ప్రత్యేకంగా మరో స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నాయి.విజయనగరం జిల్లాలో త్వరలోనే కొత్తగా రెండు పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. జనవరి నెలఖరులోగా ఈ రెండు పోలీస్ స్టేషన్ల కార్యకలాపాలు మొదలవుతాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో పెరుగుతున్న జనాభాకు మెరుగైన సేవలు అందించేందుకు గాను అధికారులు ఈ రెండు పోలీస్ స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. వీటిలో ఎన్నో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కూడా ఉంది.అలాగే, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం వల్ల.. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు స్టేషన్లు ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. విజయనగరంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత పది సంవత్సరాలుగా ఎన్నోసార్లు ప్రతిపాదించారు. వీటికి తాజాగా ఆమోదం లభించింది.విజయనగరంలో జనాభా విపరీతంగా పెరిగిపోవడంతో, ప్రస్తుతం ఉన్న రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సేవలు అందించడం కష్టమవుతోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో, కేఎల్ పురం, కణపాక ప్రాంతాల్లో కొత్త స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతోంది. నెలఖరులోగా తాత్కాలిక భవనంలో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, అక్కడ ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భోగాపురం పోలీస్ స్టేషన్తో పాటు, విమానాశ్రయం పరిధిలో ప్రోటోకాల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి ప్రత్యేక అవసరాల కోసం ఈ కొత్త పోలీస్ స్టేషన్ మంజూరైంది. భోగాపురం విమానాశ్రయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. తాజాగా నిర్వహించిన ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది.జూలై నుంచి భోగాపురం విమానాశ్రయం సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. భోగాపురం విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం కాకముందే, స్టేషన్ ఏర్పాటు, అధికారుల నియామకంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు జరుగుతోందని అధికారులు అంటున్నారు.



## బధిర బాలికలకు క్రీడా పరికరాల పంపిణీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24-:జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో నవజీవన్ బధిరుల ప్రత్యేక పాఠశాల బాలికలకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త నిర్వహణలో శనివారం స్థానిక అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి అధ్యక్షత వహించగా, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, పాఠశాల వ్యవస్థాపకులు ఫాదర్ మర్రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ బాలికల ఆరోగ్య పరిరక్షణకు ఐఎంఏ మహిళా వైద్య విభాగం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ బాలికలను చదువు, క్రీడల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మహిళా వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథం ప్రారంభం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24:-ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా మారాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో 'స్వచ్ఛ రథం' (చెత్త సేకరణ వాహనం)ను మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, స్వచ్ఛమైన వాతావరణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇళ్లలో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఇచ్చి స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. పనికిరాని వస్తువులను స్వచ్ఛ రథానికి అందిస్తే తగిన ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వచ్ఛత ప్రజలందరి సామూహిక బాధ్యత అని చెప్పారు. చెత్తను సక్రమంగా సేకరించి శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నంది బాలోత్సవాలకు పిలుపు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24:నంద్యాలలో ఫిబ్రవరి 17, 18 తేదీలలో జరగనున్న నంది బాలోత్సవాలను విజయవంతం చేయాలని బాలోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా. క్రాంతి చైతన్య, డా. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే ఈ బాలోత్సవాల ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. శనివారం భగత్ సింగ్ గ్రంథాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్, రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలుగా కల్చరల్, అకాడమిక్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం బాలోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

# 28 నుంచి నంద్యాల జిల్లాలో బీజేపీ కీలక సమావేశాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24-బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇంచార్జి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి రాయలసీమ పర్యటనలో భాగంగా ఈనెల 28 నుంచి 30 వరకు నంద్యాల జిల్లాలో అసెంబ్లీ స్థాయి సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల షెడ్యూల్ ఇలా ఉంది. ఈనెల 28వ తేదీన ఉదయం 10 గంటలకు ఆళ్లగడ్డ అసెంబ్లీ సమావేశం, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు నంద్యాల అసెంబ్లీ సమావేశం జరుగుతాయి. 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు బనగానపల్లె అసెంబ్లీ, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు డోన్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు నందికొట్కూరు అసెంబ్లీ సమావేశం, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీశైలం అసెంబ్లీ సమావేశం



ఆత్మకూరు పట్టణంలో జరుగనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ఆయా అసెంబ్లీ పరిధిలోని అన్ని మండలాల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు వంద శాతం హాజరు కావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. అలాగే క్రియాశీలక సభ్యులు, సీనియర్ నాయకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. సమావేశాలకు హాజరయ్యే ప్రతీ ఒక్కరూ పార్టీ కండువా ధరించి రావాలని, మండల అధ్యక్షులు తమ మండల కమిటీ సభ్యులతో వెంటనే సంప్రదించి సమావేశాల వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ ప్రకటనపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె చంద్రశేఖర్, ఏ శివకృష్ణ యాదవ్, ఒంటెద్దు బండి కిరణ్ లు సంయుక్తంగా తెలిపారు.

# గణతంత్ర దినోత్సవ పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24 :నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ నందు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వు ఇన్స్పెక్టర్ మంజునాథ్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించి కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వాహనంలో పరేడ్‌ను పరిశీలించి బలగాలకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కవాతులో ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు, హోంగార్డ్స్, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు, పోలీస్ బ్యాండ్ పాల్గొన్నారు. పోలీస్ జాగిలాలు హాని, మార్షల్ చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి , రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు, మంజునాథ్, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు ఉమామహేశ్వర రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

## హలో యువత 'చలో విజయవాడ' నిరుద్యోగ రణభేరి ని జయప్రదం చేయండి... ఏఐవైఎఫ్ పిలుపు...

దేవనకొండ:- జనవరి 30న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "చలో విజయవాడ ? నిరుద్యోగ రణభేరి" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్, సహాయ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో నిరుద్యోగ రణభేరి కి సంబంధించి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ, అసంతృప్తిలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వాన్ని విమర్శించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం జాబ్ గ్యారంటీ బాబు సూరిటీ అని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం, నోటిఫికేషన్ల విడుదలలో నిర్లక్ష్యం వహించడం వల్ల లక్షలాది మంది యువత ఏళ్ల తరబడి ఎదురుచూపుల్లోనే మగ్గిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు నిరసనగా నిరుద్యోగ యువత హక్కుల సాధన కోసం జనవరి 30న విజయవాడలో "నిరుద్యోగ రణభేరి ? చలో విజయవాడ " కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని,ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని, ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి, ఔట్‌సోర్సింగ్?కాంట్రాక్ట్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. " కొలువులకై కొట్లాడుదాం ? రండి!" అని నినాదం చేస్తూ జనవరి 30న ఛలో విజయవాడకు ఏఐవైఎఫ్ పిలుపు నివ్వడం జరిగిందన్నారు. దేవనకొండ నుండి అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, యువతి, యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కృష్ణ, రాజశేఖర్, రాజు, వీరాంజనేయులు, భాస్కర్, రంగడు, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదుల వేదిక తాత్కాలిక రద్దు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24-జనవరి 26వ తేదీ సోమవారం భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ తెలిపారు. ఈ నేపథ్యంలో అర్జీదారులు దూర ప్రాంతాల నుంచి రావొద్దని సూచించారు. ఫిబ్రవరి 2వ తేదీ సోమవారం నుంచి జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

## జనవరి 26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు--

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24 :-77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీ సోమవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని మండల, డివిజన్ మరియు మున్సిపల్ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు పండుగ వాతావరణంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కారణంగా ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 26న నిర్వహించబోమని స్పష్టం చేశారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి అనవసరమైన ప్రయాసలకోర్చి నంద్యాల జిల్లా కేంద్రానికి రావద్దని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌కే రోడ్డు-ఎన్జీవో కాలనీ అనుసంధానం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 24:నంద్యాల పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కీలక చర్యలు చేపట్టారు. ఎన్జీవో కాలనీకి నేరుగా రాకపోకలు కల్పించే లక్ష్యంతో శ్రీనివాస్ నగర్?నూనెపల్లె ప్రధాన రహదారి (ఎన్‌కే రోడ్డు)లో శ్రీరామ థియేటర్ వెనుక చామకాల్వపై డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చామకాల్వపై 2.5 కి.మీ వద్ద డిఎల్ఆర్‌బి నిర్మాణానికి రూ. 3.075 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు రోడ్డు వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు, వర్షాకాలంలో లో?లెవెల్ బ్రిడ్జి వద్ద వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోవడం సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. బ్రిడ్జి పూర్తయితే మెయిన్ రోడ్డునుంచి ఎన్జీవో కాలనీకి నేరుగా రాకపోకలు సులభమవుతాయని అధికారులు తెలిపారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణకు అవకాశం ఏర్పడటంతో పాటు ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందనుందని పేర్కొన్నారు. డిఎల్ఆర్‌బి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని కేసీ కెనాల్ డీఈ రవికుమార్, ఏఈ అబ్దుల్ మునాఫ్ తెలిపారు.

## విశాఖ ఉత్సవ్ ప్రారంభం

విశాఖపట్నం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్న విశాఖ ఉత్సవ్ నేటి నుంచి ప్రారంభమైంది. సీ టూ స్కై అనే ప్రత్యేక కాన్సెప్ట్‌తో ఫిబ్రవరి 1 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు సాగనున్నాయి. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరా జు జిల్లాల్లో ఒకేసారి వేడుకలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విశాఖ ఆర్కే బీచ్ను ప్రధాన వేదికగా ఎంపిక చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**